# చందాగిరి !

విఘ్నేశ్వరుడి నిమజ్జనం నిర్విఘ్నంగా జరిగిపోయినా, దాని వెనుక నున్న చందాలు ప్రహసనం మాత్రం ఇంకొన్నాళ్ళు గుర్తుండి తీరుతుంది. శ్రీరామ నవమి, వినాయక చవితి, హోళి పండుగలు చందాల వసూలుకి మంచి సీజను.... బస్తీకుర్రాళ్ళకి జబర్దస్తీ కాలం. పదిమంది కల్సి జట్టుగా ఇంటింటికి తిరిగి చందా వసూలు చేసే సన్నివేశం. ప్రతి గల్లీలో కనిపిస్తుంది. ఫలానా వాళ్ళింతిచ్చారు. కాబట్టి, మీరూ అంతే ఇవ్వాలని పట్టుపట్టి కూర్చుంటారు. మీరు కాదంటే మన దేవుడూ పండగలు మతం ఏం కానని వర్రీ అవుతాడు. ఎవరికీ చెప్పనంటే. మొదటిరోజున మీ గోత్రనామాలతో పూజలు చేయిస్తారని ప్రలోభ పెడతారు. అప్పటికి మీరు చందా ఇవ్వటానికి సుముఖత్వం ప్రదర్శించకపోతే ఆఖరి అస్త్రంగా బస్తీలో వుండలేవని అల్టిమేటం విసురుతారు. ఇచ్చేరా సరే. లేదు, నిమజ్జనం వూరేగింపు రోజున అరటిపళ్ళ తొక్కలూ సిగిరెట్టు పీకలు మీ ఇంటి గడపలో వానజల్లు లాగా వచ్చి కురుస్తాయి. అవన్నీ శుభ్రం చేయటానికి పనిమనిషి పదో పరకో అడుగుతుంది. అంచేత అనుభవజ్ఞుడెవడూ చందా ఇవ్వననడు....తృణమో, పణమో ఇచ్చి తప్పుకుంటాడు. ఈ మధ్యన ఈ చందాల వసూలు కాని మొండి బాకీల్ని చందా కుర్రాళ్ళకి అప్పగించి కొంత మంది చేతులు దులుపుకుంటున్నారట. అలాగే చందాకొచ్చిన వాళ్ళతో చిట్‌ఫండ్ కంపెనీలో చీటీ పాడేరు. మీలో ఎవరన్నా హామీ సంతకం గాని చేసారంటే భారీగా ఇచ్చుకుంటానని ఆఫర్సు గూడా చేస్తున్నారట. శతకోటి చందాలకి అనంతకోటి ఎగ్గొట్టే మార్గాలు కనుక్కొబడుతున్నాయి. అయినా ఈ చందాల క్రీడ నిర్విఘ్నంగా సాగిపోతూనే ఉంది.

చందాలలో రకాలున్నాయి. సీజన్ చందాలు, నిత్య చందాలు అని తిరుపతి వెడుతున్నాం, చందా కావాలంటూ ఇద్దరు ముగ్గురు ఆడవాళ్ళు పళ్ళెం, చాటల్లో కాసిని బియ్యం, పసుపుగుడ్డ వగైరా హంగుతో వస్తుంటారు. అలాగే, పక్క వీధి మసీదు దగ్గర పేదవాళ్ళకి అన్నదానం చేస్తున్నాం. చందా కావాలంటూ చిన్న రసీదు పుస్తకం పుచ్చుకుని, బాగా మాసి పోయిన బట్టలు, గడ్డంతో ఒక యువకుడు బుక్కిస్తాడు. అతడ్ని

చూస్తే అన్నదానం చేసే వ్యక్తి లాగా కనిపించకపోగా, పాపం అన్నం మొహం చూసి ఎన్నాళ్ళయ్యిందో గదాని చచ్చే జాలేస్తుంది. ఇలాంటివన్నీ నిత్య చందాలు . అంటే సంవత్సరం పొడుగునా వసూలు చేసుకోవచ్చు. గుడికట్టిస్తున్నాని, బడికట్టిస్తున్నాని , ఆడపిల్ల పెళ్ళి చేస్తున్నానని , రకరకాల వర్షన్స్‌తో కార్యక్రమం కొనసాగుతూనే వుంటుంది. భూమి తన చుట్టూ తాను తిరుగుతూ సూర్యుని చుట్టూ తిరుగుతుందని మాష్టారు చెప్తుంటే , చేతిలో రసీదు బుక్కుందా అనడిగాట్ట వెనక బెంచీలోని ఓభావి పౌరుడు. అంత సహజం అయిపోయిందీ చందాగిరి !

ఈ మధ్యన ఈ చందాల వసూలు సందర్భంలో ఒక చిత్రమైన సంగతి జరిగిందిట. మామూలుగా ఒక జట్టు కుర్రాళ్ళు చందాకోసం ఓ ఇంటికెళ్ళారట. ఆ ఇంటి గేటుకి ఒక అట్టబోర్డు వ్రేలాడదీసుందిట. దాని పైన ‘ చందాలు కావాల్సిన వారు దయచేసి క్రింది నెంబరుకి ఫోన్ చెయ్యండ’ని రాసి కింద హానెస్టుగా నెంబరు కూడా వేసారట. కుర్రాళ్ళు ఉత్సాహం కొద్దీ ఆ నెంబరుకి ఫోన్ చేసారట. అవతల వైపు నించి, ఒక ముదురు గొంతు ఎంతో నమ్రతగా తప్పకుండా రమ్మని అడ్రసు, గుర్తులు , ఉపయోగించాల్సిన ప్రయాణ సాధనాలు ఇలా చెప్పుకొచ్చాట్ట. ‘ సరాసరి సెంటరు కొచ్చి ఫలానా నెంబరు బస్సు ఎక్కండి. ఫలానా చోట దిగి ఈ నెంబరు బస్సుని పట్టుకోండి. ఆ బస్సులోంచి ఫలానా చోట దిగి , గుడిసె రిక్షా మాట్లాడుకుని ఎక్కండి. సరాసరి నది ఒడ్డుకు రండి. రిక్షా దిగండి. బల్లకట్టు రెడీగా వుంటుంది. ఎక్కండీ. అవతల గట్టున దిగండి. మట్టి రోడ్డు కనిపిస్తుంది. నడవండి నడవండి అరటి తోట ……. హల్లో …మిమ్మల్నే హల్లో ’ అప్పటికే చందా దారుడు ఫోన్ పెట్టేసి పరారయిపోయాడు. ఇంతా చేసి ఫోన్లో టూర్ ప్రోగ్రాం చెప్పిన వ్యక్తి ఇక్కడ ఇంటి యజమాని కాదట. అతగాడి బావగారట. అక్కడ బావగారింటి ముందు ఇదే విధంగా బోర్డుకట్టి ఈ బావ మరిది ఫోన్ నెంబర్‌వాడేట్ట. ఆ బస్తీ కుర్రాళ్ళు గాని ఫోన్ చేస్తే ఇదే ప్రోగ్రాం వీడు చేప్తారన్న మాట. అతి సర్వత్రా వర్జియేత్ అన్న నానుడి ఈ చందాల కార్యక్రమానిక్కూడా వర్తిస్తుంది. ఈ విషయాన్ని చందా వీరులు గమనిస్తే అందరికీ మేలు.

------- అయ్యిపోయింది -------